జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761


epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 16-4-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 647 పేజీలు: 4 వెల : రూ.7

## టీడీపీ జాతీయ, రాష్ట్ర కమిటీల్లో..

# సిక్కోలుకు పెద్దపీట

* పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీల్లో సిక్కోలు నేతలు
* పార్టీలో కింజరాపులదే హవా
* టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్
* జాతీయ కార్యదర్శిగా రామ్మోహన్
* పొలిట్‌బ్యూరో కమిటీ సభ్యులుగా అచ్చెన్న
* రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శిరీష
* అధికార ప్రతినిధిగా కూన రవి
* మరికొందరికి కమిటీలో స్థానం
* జిల్లావ్యాప్తంగా సంబరాలు





**శ్రీకాకుళం, ఏప్రిల్ 15 (వార్త):** తెలుగుదేశం పార్టీ జాతీయ, రాష్ట్ర కమిటీల్లో శ్రీకాకుళం జిల్లాకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పెద్దపీట వేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన నాయకులకు కమిటీల్లో స్థానం కల్పించింది. తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్‌ను నియమించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కింజరాపు రామ్మోహన్‌నాయుడిని, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా అచ్చెన్నాయుడును నియమించారు. జాతీయ అధికార ప్రతినిధిగా శ్రీకాకుళం జిల్లా రణస్థలానికి చెందిన విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు నియమితులయ్యారు. ఇక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఆమదాలవలస నియోజకవర్గానికి చెందిన తమ్మినేని సుజాత, శ్రీకాకుళం జిల్లాకు చెందిన చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకట్రావు, రాష్ట్ర అధికార ప్రతినిధులుగా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రాజాం నియోజకవర్గానికి చెందిన కావలి గ్రీష్మ, జోనల్ కోఆర్డినేటర్‌గా ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా వజ్జ బాబూరావు(పలాస), బగ్గు అర్చన (నరసన్నపేట), కోళ్ల అప్పలనాయుడు (రాజాం), కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు (చీపురుపల్లి), రాష్ట్ర కార్యదర్శులుగా పొగిరి బుచ్చిబాబు (పాతపట్నం), మాదారపు వెంకటేష్ (శ్రీకాకుళం) నియమితులయ్యారు. మొత్తం కార్యవర్గంలో శ్రీకాకుళం జిల్లా నుంచి పలువురు నేతలకు చోటు లభించింది.








### టీడీపీ కార్యాలయాల్లో సంబరాలు

తెలుగుదేశం పార్టీ జాతీయ, రాష్ట్ర కమిటీల్లో జిల్లానేతలకు పెద్దపీట వేయడంతో జిల్లావ్యాప్తంగా టీడీపీ కార్యాలయాల్లో సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి, బాణసంచా పేల్చి ఆనందం వ్యక్తం చేశారు. కమిటీల్లో స్థానం దక్కించుకున్న వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.



# ఇంటర్ ఫలితాల్లో బాలికల సత్తా

* ప్రథమంలో 21, ద్వితీయంలో 23వ స్థానం
* మెరిసిన ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు
* ప్రైవేట్ పాఠశాలల్లో సంబరాలు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 15 (వార్త):** ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా సిక్కోలు ఫస్టియర్‌లో 21వ స్థానం, సెకండియర్‌లో 23వ స్థానంలో నిలిచింది. మొదటి సంవత్సరంలో 70 శాతం, ద్వితీయ సంవత్సరంలో 73 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈసారి కూడా బాలికలే టాప్‌లో నిలిచారు. గత ఏడాది కంటే స్వల్పంగా ఉత్తీర్ణతా శాతం తగ్గింది. ప్రైవేట్ కళాశాలల విద్యార్థుల మంచి ఫలితాలను రాబెట్టారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సైతం ప్రైవేట్‌కు ధీటుగానే మార్కులు సాధించారు. అంబేడ్కర్ గురుకులాల్లో విద్యార్థులు 88 శాతం ఉత్తీర్ణత సాధించారు.


### తక్కువ మార్కులు వచ్చాయని ఆత్మహత్యాయత్నం..

లావేరు మండలానికి చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థిని.. తక్కువ మార్కులు వచ్చాయని మనస్థాపానికి గురై ఆత్మహత్యకు యత్నించింది. ఇంట్లో చీమల మందును నీటిలో కలిపి తాగేసి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు రణస్థలం సీహెచ్‌సీకి తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటోంది.

## పశు రవాణాకు..

# అడ్డుకట్టేది?

* నిత్యం జిల్లా నుంచి తరలిపోతున్న పశువులు
* సంతల్లో పర్యవేక్షణ లేకపోవడమే కారణం
* వాహనాల్లో కుక్కి రవాణా
* మడపాం టోల్‌గేట్ వద్ద 12 పశువులు స్వాధీనం చేసుకున్న పోలీసులు



**శ్రీకాకుళం/నరసన్నపేట, ఏప్రిల్ 15 (వార్త):** జిల్లాలో పశువుల రవాణాకు అడ్డుకట్ట లేకుండా పోయింది. నిత్యం జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు తరలిపోతోంది. కొందరు పశు తరలింపుదారులు రాత్రిపూట వాహనాల తనిఖీ ఉంటుందని, పగలు ఉండదన్న ధీమాతో వాహనాల్లో ఎవరికీ అనుమానం కలుగని విధంగా పశువులను రవాణా చేస్తున్నారు. ఎక్కువగా సంతల్లోనూ, ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో పశువులను కొనుగోలు చేసి వాటిని విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. సంతల్లో పోలీసుల పర్యవేక్షణ లేకపోవడం, ఉన్నా మామూళ్ల దందా వల్ల పశు రవాణా యథేచ్ఛగా సాగుతోందన్న విమర్శలు ఉన్నాయి. బుధవారం ఉదయం నరసన్నపేట ఎస్ఐ బి.గణేష్ ఆధ్వర్యంలో సిబ్బంది టోల్‌గేట్ వద్ద పలు వాహనాలను తనిఖీ చస్తున్న సమయంలో కంచిలి ప్రాంతం నుంచి ఏడు పశువులతో వస్తున్న ఒక వాహనం, నారాయణ వలస సంత నుంచి ఐదు పశువులతో వెళ్తున్న మరో వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. సరైన అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్నట్లు గుర్తించి, మొత్తం 12 పశువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పశువులను గోశాలకు తరలించినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.




## కన్న వారికి

# కడుపుకోత

* రహదారి ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి
* చౌకపేటలో విషాదం



**మందస, ఏప్రిల్ 15(వార్త):** అందివచ్చిన కుమారుడు అందని లోకాలకు వెళ్లిపోయాడు. కన్నతల్లిదండ్రులకు కడుపుకోతను మిగిల్చాడు. సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్న ఆ యువకుడు రోడ్డు ప్రమాదంలో మరణించి ఆ కుటుంబానికి విషాదాన్ని మిగిల్చాడు. వివరాల్లోకి వెళితే.. మందస మండలంలోని పొత్తంగి పంచాయతీలో గల చౌకపేట గ్రామానికి చెందిన వికాస్ కుమార్ నేపాక్ సాఫ్ట్ వేర్‌లో ఉద్యోగం చేస్తూ.. హైదరాబాదులోని హఫీజ్ పేట మార్తాండ నగర్‌లో ఉంటున్నారు. పిల్లి కల్యాణ్, భరత్ కుమార్, గణేశ్, పుప్పాల గూడకు చెందిన వికాస్ కుమార్ నేపాక్(25)లు స్నేహితులు. వీరంతా హైదరాబాదు నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. తెల్లవారుజామున 4గంటలకు టిఫిన్ చేసేందుకు రెండు బైక్ లపై హఫీజ్ పేట నుంచి నానక్రాంగూడకు బయల్దేరారు. అక్కడ టిఫిన్ సెంటర్లు అందుబాటులో లేకపోవడంతో తిరిగి హఫీజ్ పేటలకు పయనమయ్యారు. గణేశ్, కల్యాణ్ ఒక బైక్ పై ఉండగా, భరత్ కుమార్ తన బైక్‌పై వికాస్‌తో కలిసి వస్తున్నారు. గచ్చిబౌలి పీజేఆర్ ఫ్లైఓవర్ సమీపానికి చేరుకోగానే భరత్ కుమార్ నడిపే బైక్ అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. వికాస్ కుమార్ తలకు తీవ్ర గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, ఈ ప్రమాదంలో భరత్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. మృతుని తండ్రి లింగరాజు నేపాక్ బుడారిసింగి స్కూల్ లో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. తల్లి గీతానేపాక్ సాధారణ గృహిణి. మృతదేహాన్ని చౌకపేట తీసుకువచ్చి, అంత్యక్రియలు నిర్వహించారు.



# టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గౌతు శిరీష



**పలాస, ఏప్రిల్ 15 (వార్త):** తెలుగుదేశం పార్టీలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకి కీలకమైన పదవి దక్కింది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆమెను నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా ఆమె తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే గౌతు శిరీష తనపై నమ్మకంతో ఈ భారీ బాధ్యతను అప్పగించినందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌కి ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవ చేసే అరుదైన అవకాశాన్ని కల్పించినందుకు పార్టీకి రుణపడి ఉంటానని తెలిపారు . నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పార్టీ బలోపేతం కోసం, ప్రజల సేవ కోసం పూర్తి నిబద్ధతతో, నిరంతర కృషితో ముందుకు సాగుతాను." అని పేర్కొన్నారు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తానని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆమెకు ఈ పదవి దక్కడం పట్ల పలాస నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఎమ్మెల్యే అశోక్‌కు ఆటో యూనియన్ కృతజ్ఞతలు



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 15 (వార్త):** కవిటి రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇచ్ఛాపురం ఆటో యూనియన్ అధ్యక్షుడు, సీనియర్ సభ్యుడు, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండా శంకర్ రెడ్డితో కలిసి ఆటో యూనియన్ ప్రతినిధులు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఖుర్దా డివిజన్‌లో ఉన్న ఇచ్ఛాపురంని విశాఖ రైల్వే జోన్‌లో విలీనం చేసినందుకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి, బెందాళం అశోక్‌బాబుకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## జనగణనపై శిక్షణ




**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 15 (వార్త):** జనగణన-2027 కార్యక్రమం విజయవంతంగా నిర్వహించుటకు ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో తొలి విడత శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ఈ శిక్షణలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు ఇండ్ల జాబితా (హౌస్ లిస్టింగ్) హౌసింగ్ గణనపై వివరమైన మార్గదర్శకాలు అందించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న లెక్చరర్లు దుర్యోధన దళాయి, ఎన్.తశివకుమార్ ఫీల్డ్ ట్రైనర్లుగా వ్యవహరించి శిక్షణ అందించారు. గణన విధానాలు, ఫార్ముల నింపుట, ఫీల్డ్ స్థాయి సవాళ్ల, వాటి పరిష్కారాలపై సమగ్రంగా వివరణ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ నల్లి రమేష్ జనగణన ప్రక్రియను ఖచ్చితంగా, సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు. మున్సిపాలిటీ మేనేజర్ వై.అప్పలస్వామి, టౌన్ ప్లానింగ్ అధికారి పత్తిక చంటి, లలిత్‌కుమార్, రవళి, జయంత్, శానిటరీ సిబ్బంది ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణ ద్వారా ఎన్యూమరేటర్లు సూపర్వైజర్లు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించగలరని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన

**-మండల విద్యాశాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావు**

**-పాఠశాల అభివృద్ధికి రూ.80వేలు అందించిన రిటైర్డ్ ఆర్మీ సుబేదార్ మేజర్ బతకల చంద్రయ్య**



**మందస, ఏప్రిల్ 15(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన జరుగుతోందని మందస మండల విద్యాశాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావు అన్నారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన అంబుగాం పంచాయతీ లింబుగాం గ్రామ పాఠశాలలో వార్షికోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావు పాల్గొని మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన బోధన ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతుందన్నారు. అందరూ కూడా ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను జాయిన్ చెయ్యాలని తల్లిదండ్రులను కోరారు. వార్షిక పరీక్షలలో ఉత్తీర్ణత పొందిన ప్రతీ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వారికి ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులు అందజేసి, వారిని అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్పు జగన్మోహనరావు అధ్యక్షతన పాఠశాలకు సుమారు రూ.80వేల సహాయ సహకారాలు అందించిన రిటైర్డ్ ఆర్మీ సుబేదార్ మేజర్ బతకల చంద్రయ్య సన్మాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటరావు, వైస్ చైర్మన్ పి.విజయమోహనరావు, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అందరూ పాల్గొని విజయవంతం చేశారు.

## గరుడభద్రలో ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యంపై అవగాహన ర్యాలీ

**పలాస, ఏప్రిల్ 15 (వార్త):** "ప్రైవేట్ బడులు వద్దు - ప్రభుత్వ బడులు ముద్దు","మన ఊరు - మన బడిని కాపాడుకుందాం" అనే నినాదాలతో గరుడభద్రలోని జెడ్పీ హైస్కూల్, ఎంపీపీ/ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా సదుపాయాలు, నాణ్యమైన బోధన, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను గ్రామ ప్రజలకు తెలియజేయడం ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీగా సాగుతూ, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో గ్రామ సమాజం భాగస్వామ్యం చాలా ముఖ్యమని, "మన ఊరు -- మన బడి" భావనతో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. ఈ ర్యాలీని ప్రధానోపాధ్యాయులు వందన, భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# గ్రామాల్లో జీవనోపాధుల వార్షిక రుణ ప్రణాళికలు

**-వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు**

**మందస, ఏప్రిల్ 15(వార్త):** గ్రామాల్లో జీవనోపాధుల వార్షిక రుణ ప్రణాళికలు తయారు చేస్తున్నట్టు మందస వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. బుధవారం మండల సమాఖ్యలో ఏర్పాటు చేసిన అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గ్రామ గ్రామాన మహిళా సంఘ సభ్యులందరూ ఎంటర్‌ప్రైనర్లు కావాలనే సంకల్పంతో వార్షిక జీవనోపాధుల రుణ ప్రణాళికలు ఖచ్చితంగా తయారు చేయడానికి ప్రతీ గ్రామ సంఘంలో కూడా వెలుగు సిబ్బంది వి.ఓ.ఏ, ఈ నారీ సీఆర్పీలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో పంచ సూత్రాలు పాటిస్తున్న అన్ని స్వయం సహాయక సంఘాల మహిళలకు సమావేశం ఏర్పాటు చేసి వారి ఆదాయాభివృద్ధిని ప్రోత్స హించే కార్యక్రమాలకు అవసరమైన రుణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. తీర్మానం పుస్తకంలో నమోదు చేసి ఆమోదించాలని సూచించారు. ఇంటర్నల్ లెండింగ్ తో పాటు ఉమెన్ లెడ్ ఎంటర్ప్రైనర్లుగా తయారుకావడా నికి గ్రూపు ఆమోదంతో వ్యక్తిగత రుణాలను కూడా అంద జేస్తున్నట్లు వివరించారు. అర్హతను బట్టి స్త్రీనిధి, సి.ఐ. ఎఫ్, ఉన్నతి, బ్యాంక్ లింకేజ్ మొదలగు అన్ని రకాల లోన్స్‌కు కూడా బయోమెట్రిక్ పద్ధతిలో రుణాలు మంజూ రు చేస్తున్నట్లు వివరించారు. గ్రామాలలో వెలుగు సిబ్బంది బాధ్యతతో అందరికీ అవగాహన కల్పించి, అందరి ఆమో దంతో సంఘం వారి మంచి ప్రణాళికలు తయారు చేసు కోవాలని తెలిపారు. కార్యక్రమంలో అకౌంటెంట్లు కళ్యాణి, భాగ్యలక్ష్మి, క్లస్టర్ కోఆర్డినేటర్లు, గ్రామ సంఘం సిబ్బంది వీవోఏలు, ఈనారీ సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



# కరవంజ మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం

**- 97% పైగా ఉత్తీర్ణతతో మెరుగైన ఫలితాలు**

**జలుమూరు, ఏప్రిల్ 15 (వార్త):** ఇంటర్మీడియట్ ఫలితాల్లో కరవంజ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విశేష ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ వెల్లడించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 68 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 66 మంది ఉత్తీర్ణులై 97 శాతం ఫలితాన్ని నమోదు చేశారు. ఎం.పి.సి విభాగంలో రావాడ హేమశిరీష, పందిరి రేవతి ఇద్దరూ 470లో 465 మార్కులు సాధించి ప్రథమ స్థానం పొందగా, బైపీసీ విభాగంలో తంగి సంతోషి కుమారి 455లో 445 మార్కులు సాధించారు. సి.ఈ.సి విభాగంలో వాన ధృతిజ 500లో 447 మార్కులు సాధించి ముందంజలో నిలిచారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 95 మంది విద్యార్థులు హాజరుకాగా, అందులో 93 మంది ఉత్తీర్ణులై 97.89 శాతం ఫలితాన్ని నమోదు చేశారు. ఎం.పి.సి విభాగంలో అన్నెపు ప్రియ 1000లో 974 మార్కులు సాధించగా, బైపీసీ విభాగంలో లంబ గ్రేసి 966 మార్కులు, సి.ఈ.సి విభాగంలో దుంగ జ్యోత్స్న 967 మార్కులు సాధించి తమ తమ విభాగాల్లో ప్రథమ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ విజయానికి కారణమైన ఉపాధ్యాయులు, కృషి చేసిన విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు. విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు.




# 'శాతవాహన కళాశాల' విద్యార్థుల ప్రతిభ



**మందస, ఏప్రిల్ 15(వార్త):** ఇంటర్మీడియట్ ఫలితాల్లో శాతవాహన జూనియర్ కళాశాల విద్యార్థుల మంచి ప్రతిభ చూపారు. గత 24 సంవత్సరాలుగా నిరంతరం ఉత్తమ ఫలితాలు సాధిస్తూ, క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్న శాతవాహన జూనియర్ కళాశాల, హరిపురం 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో మరోసారి విశేష విజయాన్ని నమోదు చేసింది. సీనియర్ ఇంటర్మీడియట్‌లో 1000మార్కులకు బైరిసారంగపురం గ్రామానికి చెందిన ఎర్ర అంకిత 975 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. మందస గ్రామానికి చెందిన కాదురు బిందుశ్రీ 974 మార్కులు, మందస గ్రామానికి చెందిన శివాని పండా 973 మార్కులు సాధించి కళాశాల ప్రతిష్టను మరింత పెంచారు. జూనియర్ ఇంటర్మీడియట్‌లో 470మార్కులకు హరిపురం గ్రామానికి చెందిన గోకర్ల జ్యోత్స్న 450మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. మొత్తం ఫలితాల్లో 26మంది విద్యార్థులు 900మార్కులకు పైగా, 38మంది విద్యార్థులు 400మార్కులకు పైగా సాధించి సత్తా చాటారు. జూనియర్, సీనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థులు 76శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషంగా నిలిచింది. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన బోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఈ విజయానికి ప్రధాన కారణమని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ విజయానికి కారణమైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులకు కళాశాల యాజమాన్యం హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# ఇంటర్ ఫలితాల్లో..
# సూర్యోదయ విద్యార్థుల ఘన విజయం

**మందస, ఏప్రిల్ 15(వార్త):** సూర్యోదయ స్కూల్ విద్యార్థుల ఘన విజయం సాధించారు. మందస పట్టణంలోని సూర్యోదయ స్కూల్ విద్యార్థుల విజయపరంపర కొనసాగుతోంది.

ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో సూర్యోదయ స్కూల్ పూర్వ విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను ఘనంగా చాటుకున్నారు. అత్యధికంగా 467, 464, 464, 460, 456 మార్కులు సాధించి అద్భుత ఫలితాలను నమోదు చేశారు. గత విద్యా సంవత్సరంలో సూర్యోదయ స్కూల్‌లో 10వ తరగతిలో ప్రభంజనం సృష్టించిన ఈ విద్యార్థులు ఈ ఏడాది కూడా ఇంటర్‌లో మార్కుల సునామీ సృష్టించి తమ ప్రతిభను మరోసారి నిరూపించారు. 467(సాయికేతన్, ఏపీఆర్జేసీ, నిమ్మకూరు), 464(శృతి, శ్రీచైతన్య), 464(సుస్మిత, శ్రీచైతన్య), 460(మణిశరణ్, శ్రీచైతన్య), 456(ప్రియాంక సాహు, శ్రీచైతన్య) మార్కులు సాధించారు. ఈ ఫలితాలతో సూర్యోదయ స్కూల్‌కు విద్యార్థులు మంచి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చారని స్కూల్ డైరెక్టర్ మోణంగి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ పిల్లి లోకేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



## 'గాయత్రి' ఘన విజయం

**మందస, ఏప్రిల్ 15(వార్త):** సామాన్య కుటుంబంలో జన్మించిన గాయత్రి ఇంటర్ మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఘన విజయం సాధించింది. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన బహడపల్లి గ్రామానికి చెందిన సార దూర్వాసులు, లక్ష్మి దంపతులకు జన్మించిన సార గాయత్రి ఇదే మండలంలోని హరిపురంలో గల శ్రీకుమార్ కళాశాలలో ఇంటర్ మీడియట్ చదువుకుంటూ పరీక్షలు రాసింది. బుధవారం వచ్చిన ఫలితాల్లో 1000 మార్కులకు 975 మార్కులు సాధించింది. బైపీసీలో టాపర్‌గా నిలిచింది. మంచి మార్కులు సాధించిన గాయత్రిని శ్రీకుమార్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, ఆమె తల్లిదండ్రులు దూర్వాసులు, లక్ష్మి దంపతులు, గ్రామస్తులు అభినందించారు. మూలిపాడు మాజీ సర్పంచ్ గుసిరి వెంకటరావు కూడా గాయత్రిని ప్రత్యేకంగా అభినందించి, ఆశీర్వదించారు.



## ఇంటర్ ఫలితాల్లో ఆదిత్య విద్యార్థుల ముందంజ

**-నెంబర్ వన్ స్థానాన్ని సాధించారన్న యాజమాన్యం**



**మందస, ఏప్రిల్ 15(వార్త):** ఇంటర్ మీడియట్ ఫలితాల్లో ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు ముందంజ వేశారని కళాశాల యాజమాన్యం ప్రతినిధులు తెలిపారు. మందస మండలంలోని బాలిగాం వద్ద గల ఆదిత్య కళాశాలలో చదువుతున్న ద్వితీయ సంవత్సర విద్యార్థులు నెయ్యిల యామిని 982మార్కులు ఎంపీసీ, కర్రి నివేదం 947 మార్కులు ఎంపీసీ, మండల రోషిణి 900 మార్కులు సీఈసీ సాధించారన్నారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో మామిడి మన్మథుడు 463/470, బొడ్డు అస్మిత 461, కుర్రాయి జోష్న 458, మట్ట నికిషా 451, బైపీసీ విభాగంలో ముడుముంచి ముకుందప్రియ 446/455, పిన్నింటి పూజిత 440, సాలిన కరిష్మా 440 మార్కులు సాధించారన్నారు. ఘన విజయం సాధించిన విద్యార్థులకు కళాశాల అధ్యాపక సిబ్బంది, ప్రిన్సిపల్స్ యాజమాన్యం అభినందనలు తెలిపారు.

## ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



**మెళియాపుట్టి, ఏప్రిల్ 15(వార్త):** ఇంటర్మీడియట్ బోర్డు బుధవారం నాడు విడుదల చేసిన పరీక్ష ఫలితాలలో ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులలో ఒకరికి మించి ఒకరు ఫలితాలు సాధించారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో గల ఎస్బిఆర్ఆర్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 1000 కి 967 మార్కులతో ప్రథమ స్థానంలో పింకి బిసాయ్ నిలువగా 948 మార్కులతో ద్వితీయ స్థానంలో ఎంపీసీ లో సాయిగౌడో నిలిచారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరం బైపీసీ గ్రూప్ కి సంబంధించి 924 మార్కులతో పౌర్ణమి మజ్జిలు నిలిచారు. అలాగే బైపీసీ గ్రూపు ప్రథమ సంవత్సరం నుంచి 406 మార్కులతో సుభమ్ జెన్నా ప్రథమ స్థానంలో నిలబడగా ఎంపీసీ నుంచి 395 మార్కులతో కాళీ ప్రసాద్ మజ్జి ప్రథమ స్థానంలో నిలిచినట్టు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. అలాగే చాపరలో నున్న ఎస్ కె కె జూనియర్ కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్ దయానంద్ మాట్లాడుతూ ప్రథమ సంవత్సర ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు ధారపు మణికంఠ 457 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా 455 మార్కులతో అన్నవరపు ఊహ ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. అలాగే ద్వితీయ సంవత్సరంలోని ఎంపీసీలో 1000కి 980 మార్కులతో బర్రు సంజయ్ కళాశాల టాపర్‌గా నిలిచారని, బైపీసీలో రుంకు నవ్యశ్రీ 972 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించారన్నారు.

## టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా వజ్జ

**పలాస, ఏప్రిల్ 15 (వార్త):** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా వజ్జ బాబురావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవి మరింత బాధ్యత పెంచిందని, నన్ను గుర్తించి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా ఎన్నుకున్న పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, లోకేష్, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శాసనసభ్యురాలు గౌతు శిరీష, మాజీ మంత్రిగౌతు శ్యాంసుందర్ శివాజీకి కృతజ్ఞతలు తెలిపారు. ఏపీటీపీసీ చైర్మన్ గా, రాష్ట్ర కార్యవర్గ ప్రధాన కార్యదర్శిగా ఎంపిక కావడం తాను పూర్వజన్మ సుకృతమని తెలి పారు. పలువురు టిడిపి నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అవగాహనతో అగ్ని ప్రమాదాల నివారణ



**సోంపేట ఏప్రిల్ 15(వార్త):** అగ్గి ప్రమాదాల నివారణ పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని అగ్నిమాపక అధికారి ఎస్ సూర్యరావు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో రెండవ రోజు బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోంపేట లో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్కార భారతి విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి గాంధీ మండపం వరకు ప్లాకార్డ్స్ పట్టుకొని నినాదాలు చేస్తూ సాగారు. గాంధీ మండపం కూడలిలో మానవహారం చేపట్టారు. అనంతరం వివిధ రకాల బ్రాంచి పైపులను ఉపయోగించి నీటి విన్యాసాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ సూర్యారావు మైకు ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# తూతూమంత్రంగా సామాజిక తనిఖీ ప్రజా వేదిక



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 15 (వార్త):** ప్రతీ కుటుంబానికి ఎక్కువ పని దినాలు కల్పించటంతోపాటు ఎక్కువ వేతనం వచ్చేటట్లు చూడాలని డ్వామా పీడీ బి.లవరాజు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎస్ఆర్పీ ఎస్.మాధవ్ నేతృత్వంలో అధ్యక్షతన ఉపాధి హామీ పనులకు సంబందించి జరిగిన సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీ) తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం మొక్కుబడిగా జరిగింది. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి31 వరకు జరిగిన ఉపాధి పనులకు సంబందించి ముగ్గురు డీఆర్పీలు 10మంది విలేజ్ సోషల్ ఆడిటర్స్ ప్రతీ పంచాయితీలలో గ్రామ సభలు ఏర్పాటు చేసి జరిగిన పనులకు సంబంధించిన తనిఖీ చేసి ఆడిట్ చేశారు. ఏడాదిలో రూ.15.89కోట్లతో 1252పనులు చేపట్టామని, అందులో రూ.10.75కోట్లు కూలీల వేతనాలకు, రూ5.14కోట్లుతో మెటీరియల్స్ కోసం ఖర్చు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతీ వేతనదారుడికి కనీస వేతనం రూ.300 దాటే విధంగా పనులు కల్పించాలని, వర్క్ జరిగినపుడు ఫీల్డ్‌లో తప్పని సరిగా టెక్నికల్ ఎసెస్ అడిటర్స్ ప్రతి పంచాయతీల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి జరిగిన పనులకు సంబంధించి పనులు తనిఖీ చేసి ఆడిట్ చేశారు. ఏడాదిలో రూ.15.89కోట్లతో 1252 పనులు చేపట్టారని, అందులో రూ.10.75కోట్లు వేతనదారుల కూలీల వేతనాలకు, రూ5.14 కోట్లుతో మెటీరియల్స్ కోసం ఖర్చు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతీ వేతనదారుడికి కనీస వేతనం రూ.300 దాటేవిధంగా పనులు కల్పించాలని, వర్క్ జరిగినపుడు ఫీల్డ్‌లో తప్పని సరిగా టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండాలన్నారు. ప్రతీ వేతనదారుడుకి ముఖ ఆధారిత యాప్ ద్వారా మస్టర్ వేయాలని సూచించారు. అలా చేయకపోతే మస్టర్ డబ్బులు (వేతనం) చెందనవి తెలిపారు. మస్టర్లో గాని, పనుల్లో గాని అవినీతి జరిగితే చర్యలు తప్పదని హెచ్చరించారు. కొత్త పనులు కూడా మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభించటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీలు సీహెచ్ శ్రీనివాసరావు, పి.రాధ, హెచ్ఆర్ శ్రావణ్, ఎంపీడీఓ ప్రభాకరరావు, ఏపీఓ శ్రీనివాసరావు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక విద్యాభివృద్ధికి కృషి చేశారు

### -ఘనంగా డాక్టర్ కణితి 3వ వర్ధంతి వేడుకలు



**పలాస, ఏప్రిల్ 15 (వార్త):** గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన మహోన్నత వ్యక్తి, మాజీ పార్లమెంట్ సభ్యులు, 9వ, 10వ లోక్‌సభ సభ్యులుగా సేవలందించిన డాక్టర్ కణితి విశ్వనాధం 3వ వర్ధంతి సందర్భంగా బుధవారం డాక్టర్ వి. కణితి ప్రభుత్వ ఐటిఐ ప్రాంగణంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సందర్భంగా వక్తలు మాట్లాడుతూ డాక్టర్ కణితి విశ్వనాధం గ్రామీణ యువతకు సాంకేతిక విద్య అందించాలని సదుద్దేశంతో 1981లో ఐటిఐను స్థాపించారని, అనంతరం 2010లో 3 ఎకరాలు 27 సెంట్ల స్థలాన్ని మౌలిక వసతులతో సహా ప్రభుత్వానికి దానం చేసి, విద్యాభివృద్ధికి తన అపారమైన కట్టుబాటును చాటిచెప్పారని తెలిపారు. సామాజిక సేవలో భాగంగా ఈ గ్రామీణ ప్రాంతంలో 1971-72లో లయన్స్ క్లబ్‌ను స్థాపించి, అనేక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని, వైద్యునిగా సుమారు 55 సంవత్సరాలు ప్రజలకు సేవలందించిన ఆయనను అందరూ ప్రేమతో "డాక్టర్ గారు" అని పిలిచేవారని సభలో గుర్తు చేశారు. డాక్టర్ కణితి విశ్వనాధం విద్య, వైద్యం, సామాజిక సేవ రంగాల్లో అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పైలా జవహర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## తామరాపల్లి విద్యార్థుల ప్రతిభ





**నరసన్నపేట, ఏప్రిల్ 15 (వార్త):** తామరపల్లిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపల్ ఆర్వి కృష్ణ తారా వెల్లడించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో కే. లేఖ్య 952 మార్కులు సాధించగా, బైపీసీ విభాగంలో ఏ. సోనియా 977 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అలాగే ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో బి. పల్లవి, జె. రోజా ఇద్దరూ 470లో 459 మార్కులు సాధించగా, బైపీసీ విభాగంలో కె. ప్రవల్లిక 448 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

## ఇంటర్ ఫలితాల్లో శ్రీశయన ఆణిముత్యం



**సోంపేట, ఏప్రిల్ 15(వార్త):** ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీశయన సామాజిక వర్గం నుంచి సోంపేటలో అత్యుత్తమ ప్రతిభ సాధించి కొర్నాల ఊర్మిక ఆణిముత్యంగా నిలిచిందని ఆ సామాజిక వర్గ పెద్దలు పేర్కొన్నారు. పట్టణంలోని కొంచాడ రాజేశ్వరరావు జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఊర్మిక ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించి టౌన్ లోనే టాపర్ గా నిలిచింది. పట్టణానికి చెందిన పాత్రికేయుడు కొర్నాల రాజేష్, రజిని దంపతుల కుమార్తె ఊర్మిక విజయం ఎంతో సంతోషకరమని కళాశాల యాజమాన్యంతో పాటు స్థానిక శ్రీశైల సామాజిక వర్గ ప్రతినిధులు అలాగే శ్రీ శయన చైతన్య దీపిక ప్రతినిధులు పేర్కొన్నారు. తన విద్యా ప్రస్థానంలో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆశీర్వదించారు. ఊర్మికకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యే అశోక్‌పై దుష్ప్రచారం దురదృష్టకరం

**సోంపేట, మార్చి 29 (వార్త):** ఇచ్ఛాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ పై కొంతమంది అనవసరంగా బురదజల్లుతు దుష్ప్రచారాలకు పాల్పడడం దురదృష్టకరమని ప్రముఖ సామాజిక కార్యకర్త, ఆస్ట్రాలజర్ బెందాళం రామ్మోహన్ రావు పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం ఎమ్మెల్యే సమక్షంలో ఒక ఆదివాసీ నేత మాటిమాటికి ఏక వచనంతో మాట్లాడి అసహనానికి గురిచేసిన సందర్భాన్ని ఘోర తప్పిదముగా చిత్రీకరించి అనవసరంగా రాద్ధాంతం చేయడం బాధాకరమని రామ్మోహన్ రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల తరబడి ఈ నియోజకవర్గంలో తీరని అన్యాయానికి అవమానాలకు గురవుతున్న 27 వేలమంది తో కూడిన ఒక సామాజిక వర్గ సమస్యను పరిష్కారం దిశగా ప్రయత్నిస్తున్న ఎమ్మెల్యేను కొంతమంది టార్గెట్ చేయడం సబబు కాదని అన్నారు. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడం వెనుక డాక్టర్ అశోక్ కృషి, నియోజకవర్గం అభివృద్ధిలో నిరంతర ప్రయత్నం, సమస్యల సాధనపై ఎనలేని పట్టుదల ఆయన సొంతమని గుర్తు చేశారు. పుట్టుకతోనే శ్రీమంతుడు అయినప్పటికీ ఎన్నడూ అతనిలో అహంకారం, గర్వం మచ్చుకైనా లేవని అన్నారు. ఏ స్థాయి వ్యక్తి వచ్చిన ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్య పరిష్కారానికి కృషి చేసే వ్యక్తి డాక్టర్ అశోక్ అని అన్నారు. ఒక సీనియర్ ఎమ్మెల్యే ఎదురుగా ఆయనకు ఏకవచనంతో నువ్వు... నువ్వు అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడిన సందర్భంలో ఆయన నుంచి ఆవేశంతో వచ్చిన మాటను వీడియో రికార్డింగ్ చేసి ప్రజలలో చులకన చేయాలని అనుకోవడం చాలా పొరపాటని అన్నారు. ఈ నియోజకవర్గ ప్రజలకు అశోక్ అంటే ఏమిటో ఆయన వ్యక్తిత్వం ఎలాంటిదో ప్రతి ఒక్కరికి తెలుసునని అందుకే ఆయన ఈ నియోజకవర్గంలో విజయ పరంపర కొనసాగిస్తున్నారని అన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం లో బెంతోరియా సమస్య వారి ఒక్కరిది కాదని ఆ సమస్య ఇప్పటికైనా పరిష్కారం కావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని రామ్మోహన్ రావు గుర్తు చేశారు. ఏదేమైనా ప్రజా దర్బారులో ఫిర్యాదు కోసం వచ్చిన ఆదివాసీ నేతలు అనవసర రాద్ధాంతం చేయడం బాధాకరమని పేర్కొన్నారు.

## ఖైదీల హక్కుల రక్షణ మనందరి బాధ్యత

**శ్రీకాకుళం, ఏప్రిల్ 15 (వార్త):** జైళ్లలో విచారణ ఎదుర్కొంటున్న ముద్దాయిల హక్కులను కాపాడటంతో పాటు, వారికి చట్టపరమైన వెసులుబాటు కల్పించడం ద్వారా సత్వర న్యాయం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం ఆయన జిల్లా కోర్టు ప్రాంగణంలో పోలీసు, ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ ద్వారా బెయిల్ లభించినా బయటకు రాలేకపోతున్న వారు, మహిళలు, మరియు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ముద్దాయిల కేసులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు.

## యోగా, ధ్యానంపై విద్యార్థులకు అవగాహన



**నరసన్నపేట, ఏప్రిల్ 15 (వార్త):** విద్యార్థులు యోగా, ధ్యానం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దాడ లత సూచించారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. హార్ట్‌ఫుల్‌నెస్, ధ్యానం వంటి పద్ధతుల ద్వారా విద్యార్థులు మానసిక ప్రశాంతత పొందగలరని, ముఖ్యంగా పరీక్షల సమయంలో వచ్చే ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలిపారు. యోగా సాధన వల్ల ఏకాగ్రత పెరిగి విద్య పట్ల ఆసక్తి మరింతగా పెరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకుంటే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈదులవలస ఏపీ మోడల్ పాఠశాలలో ఆర్జేడీ ఆకస్మిక తనిఖీ

### -విద్యార్థుల ఆహారం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



**పోలాకి, ఏప్రిల్ 15(వార్త):** ఈదులువలసలోని ప్రభుత్వ ఏపీ మోడల్ పాఠశాలలో ఆర్జేడీ విజయభాస్కర్ బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలపై సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆహారం నాణ్యతను కూడా పరిశీలించి, విద్యార్థులకు పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. అలాగే పాఠ్యాంశాలను ప్రణాళికబద్ధంగా బోధిస్తున్నారా అని పాఠశాల ప్రిన్సిపల్ ప్రవీణ్‌ను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, పాఠశాల అభివృద్ధికి సమష్టిగా పని చేయాలని ఆర్జేడీ విజయభాస్కర్ సూచించారు.

## అంగన్వాడీల్లో పౌష్టికాహారం అందించాలి

**నరసన్నపేట, ఏప్రిల్ 15 (వార్త):** అంగన్వాడీ కేంద్రాల ద్వారా విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని విధిగా అందించాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ రమణమ్మ సూచించారు. బుధవారం నరసన్నపేట పెద్దపేటలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యవృద్ధికి పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని తెలిపారు. అందుకే ప్రతి అంగన్వాడీ కేంద్రంలో నాణ్యమైన ఆహారం క్రమం తప్పకుండా అందించాలని పేర్కొన్నారు. అలాగే బాలింతలు, గర్భిణీలకు సమయానికి రేషన్ సరఫరా చేయడం తప్పనిసరి అని సూచించారు. గర్భిణీలలో రక్తహీనత (అనీమియా) లక్షణాలు కనిపిస్తే వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొని పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన పొందారు.



## సత్యవరంలో భూముల రీ-సర్వే ప్రారంభం




**నరసన్నపేట, ఏప్రిల్ 15 (వార్త):** సత్యవరం గ్రామంలో భూముల రీ-సర్వే ప్రక్రియను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో రెవెన్యూ అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. డిప్యూటీ తహశీల్దార్ మాట్లాడుతూ, గ్రామంలోని రైతులందరూ తమ భూ హక్కు పత్రాలతో రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. భూములపై ఖచ్చితమైన హక్కులను సర్వే ద్వారా నిర్ధారించి, అర్హులైన వారికి పట్టాలు మంజూరు చేస్తామని తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. ఇటీవల కొన్ని భూములు హెల్త్ ఓవర్ (వివాదాస్పద)లో ఉన్నాయని, వాటి వివరాలను సేకరించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రైతులు సహకరించి అవసరమైన వివరాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరంగి మురళీధర్, సర్వేయర్ అప్పలస్వామి, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో భూముల సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు రీ-సర్వే ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.

## నరసన్నపేటలో వైభవంగా అన్న క్యాంటీన్ ప్రారంభం



**నరసన్నపేట, ఏప్రిల్ 15(వార్త):** పేద ప్రజల ఆకలి సమస్యకు పరిష్కారంగా నరసన్నపేట పట్టణంలో అన్న క్యాంటీన్‌ను అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసన్నపేట శాసనసభ్యులు శ్రీ బగ్గు రమణమూర్తి హాజరై క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజంలోని పేదలు, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో పరిశుభ్రమైన, పోషకాహార భోజనం అందించడమే అన్న క్యాంటీన్ల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రోజువారీ కూలీలు, కార్మికులు మరియు నిరుపేదలు ఈ సదుపాయంతో ఎంతో ప్రయోజనం పొందుతారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి పథకాలను అమలు చేస్తున్నదని, కేవలం రూ.5కే నాణ్యమైన భోజనం అందించడం ద్వారా ఆకలి సమస్యను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సంకల్పంతో అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించడం అభినందనీయమని కొనియాడారు.

## పిడుగుపాటు బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

### ఉదారతను చాటుకున్న చిన్న గురుదాస్‌పురం ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

**పలాస, ఏప్రిల్ 15 (వార్త):** మానవసేవే మాధవసేవ అంటారని, పెద్దలు, ఆపదలో ఉన్న అభాగ్యులను చేసే సేవ కనిపించిన ఆ భగవంతుని సేవ చేసే పుణ్యమంటారు. ఇటువంటి కాలంలో ఏప్రిల్ 5వ తేదీన అకస్మాత్తుగా ఒక విషాదం ఒక కుటుంబాన్ని విధి చిదిమేసింది. పలాస నియోజకవర్గం మందస మండలం పెద్ద కేసు పురం గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలో పిడుగుపాటుకు గురై ఇద్దరు తల్లి కూతుర్లు ముత్యవాత పడ్డారు. మరణించ డం కొద్ది నెలలకు ముందే ఆ కుటుంబానికి చెందిన పెద్దదిక్కు అయినా తండ్రి అనారోగ్య కారణంగా అకాల మరణం చెందాన విషయం తెలుసుకొని ఆ ఇంట్లో పెద్దదిక్కైన ఒక కుమార్తె ఒంటరిగా, ఈ కష్ట సమయంలో ఇది గమనించిన చిన్న గురుదాస్ పురం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పర్మర్శించి ఆ కుటుంబాన్ని కొంతమేర ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించుకొని, ఆకుటుంబానికి 15000 రూపాయలు ఆర్థిక సహాయం చేయాలని బుధవారం ఆర్థిక సహాయాన్ని ఆకుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పాలిన కృష్ణారావు, సెక్రటరీ జనగా తాతారావు, కోశాధికారి సాలిన రమేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొండే తేజేశ్వరరావు, ఎం తాతారావు, జనగ పాపారావు, పాలన పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఈదులవలస మోడల్ స్కూల్‌లో శత శాతం ఉత్తీర్ణత

**పోలాకి, ఏప్రిల్ 15(వార్త):** ఈదులవలస మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో విద్యార్థులు మెరుగైన మార్కులతో ప్రతిభ చాటుకున్నారు. ద్వితీయ సంవత్సరంలో బైపీసీ విభాగంలో యశస్విని 980 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, ఎంపీసీ విభాగంలో అల్లు దివ్య భవాని 977 మార్కులు సాధించి ప్రతిభ చూపించారు. అలాగే ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో ముద్దాడ భారతి, జలుమూరు పూర్ణిమ ఇద్దరూ 470లో 463 మార్కులు సాధించి ముందంజలో నిలిచారు.

బైపీసీ విభాగంలో బోర పూజ, గోండు యశస్విని 446 మార్కులు సాధించి మంచి ఫలితాలు నమోదు చేశారు. విద్యార్థుల ఈ విజయాన్ని పాఠశాల ప్రిన్సిపల్ అభినందిస్తూ, వారి కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.



## టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా అర్చన

**నరసన్నపేట, ఏప్రిల్ 15 (వార్త):** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా నరసన్నపేట సమ న్వయ కర్త బగ్గు అర్చనను నియమించారు. ఈ మేరకు బుధవారం పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె వెల్ల డించారు. ఈ సందర్భంగా బగ్గు అర్చన మాట్లాడుతూ, తనకు ఇంతటి బాధ్యత అప్పగించడంపై ఆనందం వ్యక్తం చేశా రు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజలకు మరింత చేరువ కావడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. తన రాజ కీయ ప్రయాణంలో తండ్రి, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందించిన సహ కారం ఎంతో ముఖ్యమన్నారు. వారి మార్గదర్శకత్వంలో పార్టీ అభివృద్ధికి శ్రమిస్తానని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.



## ఘనంగా అగ్నిమాపక వారోత్సవాలు

### - నూనె, విద్యుత్ అగ్ని ప్రమాదాలపై అవగాహన



**కోటబొమ్మాళి, ఏప్రిల్ 15(వార్త):** ఫైర్ సర్వీస్ వీక్‌లో రెండవ రోజు సందర్భంగా కోటబొమ్మాళి అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో వివిధ అవగాహన కార్యక్రమాలు ను కోటబొమ్మాళి లో విస్తృతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ప్రజల్లో అగ్ని ప్రమాదాలపై చైతన్యం కల్పించేందుకు పాంప్లెట్లు, స్టిక్కర్లు పంపిణీ చేసి, పట్టణంలోని ముఖ్య ప్రాంతాలలో అతికించారు. ఆర్టీసీ కాంప్లెక్స్, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్, ఎంపీడీఓ కార్యాలయం వంటి ప్రదేశాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు ఎక్కువగా రాకపోకలు జరిగే ప్రాంతాలను ఎంపిక చేసి అగ్ని భద్రతపై అవగాహన కల్పించారు. అదేవిధంగా నూనెతో సంభవించే అగ్ని ప్రమాదాలపై ఫోమ్ ఉపయోగించి ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్ కారణంగా జరిగే అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమాల ద్వారా అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలు గురించి ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అగ్ని ప్రమాదాలను నివారించడంలో భాగస్వాములు కావాలని అగ్నిమాపక సిబ్బంది కోరారు.

## పలాసలో ట్రాన్స్‌ఫార్మర్‌పై దుండగుల దాడి

### -వైర్లు కట్ చేసి రూ.లక్షల కాపర్ చోరీ



**పలాస, ఏప్రిల్ 15 (వార్త):** పలాసలో దుండగులు మళ్లీ తెగబడ్డారు. హైవే సమీపంలోని మున్సిపాలిటీ తాగునీటి బావి వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని దుండగులు రాత్రి వేళ దాడి చేసి వైర్లు కట్ చేసి లోపల ఉన్న సుమారు మూడు లక్షల రూపాయల విలువైన కాపర్ వైర్లను తాష్కరించారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా పలాస మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులకు కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతుండటంతో... దాని ధ్వంసం వల్ల నీటి సరఫరా అంతరాయం కలిగే పరిస్థితి నెలకొంది. ఈ ఉదయం ఘటన స్థలానికి చేరుకున్న మున్సిపల్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా ధ్వంసమైనట్లు గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. కమీషనర్ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు పరిశీలన జరిపి కాపర్ వైర్ల చోరీ జరిగినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరిస్తూ కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రత్యేకాధికారికి మామిడిపల్లి వాసుల స్వాగతం

**సోంపేట, ఏప్రిల్ 15(వార్త):** మామిడిపల్లి పంచాయతీ ప్రత్యేక అధికారిగా నియమితులైన రెవెన్యూ శాఖ డిప్యూటీ తహసిల్దారు ఉమామహేశ్వరరావుకు గ్రామస్తులు బుధవారం ఘన స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో గ్రామస్తులు సచివాలయం వద్ద ఉమామహేశ్వరరావుకు దుస్తాలకు కప్పి సత్కరించారు. గ్రామ అభివృద్ధికి సంబంధించి సత్వర నిర్ణయాలు తీసుకుని మంచి కార్యక్రమాలతో గ్రామాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలని గ్రామస్తులు కోరారు. పంచాయతీ అభివృద్ధికి తన సాయి శక్తుల కృషి చేస్తానని స్పెషల్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.




# మందస జూనియర్ కళాశాల జిల్లాకే గర్వకారణం

### -ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు ఘన విజయం

### -కళాశాల ప్రిన్సిపాల్ బి.తేజేశ్వరరావు





**మందస, ఏప్రిల్ 15(వార్త):** ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాకే వన్నె తెచ్చే విధంగా ఫలితాలు సాధించిన కళా శాలలో ఒకటిగా మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల నిలవడం గర్వంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ బి.తేజేశ్వ రరావు అన్నారు. మందసలో ఆయన బుధవారం విలేక రులతో మాట్లాడుతూ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో జి.మౌనిక 971, బైపీసీలో ఎల్.కార్తిక 929, సీఈసీలో సతీష్ చంద్రనాయక్ 901, హెచ్ఈసిలో ఎస్.కామరాజు 915, ప్రథమ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీలో ఎం.అంజలి, ఎం.దేవిశ్రీప్రసాదు, పి.అంజలి 431, బైపీసీలో బిపిన్ నాయక్ 399, సీఈసీలో టి.విజయ్‌కుమార్ 468, హెచ్ఈసిలో డి.చందన్ 385 మార్కులు సాధించారు. కళాశాలలో ద్వితీయ సంవత్సరం 88%, ప్రథమ సంవత్సరం 74% ఫలితాలు సాధించడం శుభ పరిణామమని ఈ ఉత్తమ ఫలితాలు సాధించుటకు కృషి చేసిన అధ్యాపక బృందానికి కళాశాల ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించడం చాలా సంతోషంగా ఉందని, ఈ ఫలితాలు సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సంకల్ప కార్యక్రమాల ద్వారా ఈ ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పుస్తకాల పంపిణీ వంటి విధానాల వల్ల మంచి ఫలితాలు సాధించామన్నారు. కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులుందరూ ఉత్తమ ఫలితాల సాధనలో విద్యార్థులకు నాణ్యమైన ఉత్తమమైన ఉన్నత మైన విద్యను అందించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు గురుగుబెల్లి రమణమూర్తి, పైడి గోవింద రావు, ఎల్.సోమేశ్వరరావు, డి.శాంతకుమారి, ఎన్.నాగ భూషణ్, కె.రవికుమార్, జానకిరావు, బురద రినీష, లింగ రాజు, ప్రవీణ్‌కుమార్, జి.వినయ్‌కుమార్, కె.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# నరసన్నపేటలో పారిశుధ్య కార్మికుల నిరసన

### - పేరుకుపోతున్న చెత్త - పట్టణంలో అస్వచ్ఛత - అవినీతి ఆరోపణలతో ఆందోళన తీవ్రం




**నరసన్నపేట, ఏప్రిల్ 15(వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీలో పారిశుధ్య కార్మికులు నిరసన బాట పట్టడంతో పట్టణంలో పారిశుధ్య పరిస్థితి దెబ్బతింటోంది.

మంగళవారం సాయంత్రం నుంచి కార్మికులు విధులకు గైర్హాజరవడంతో చెత్త నిలువలు పేరుకుపోతున్నాయి. తమ సమస్యలపై అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ ఆందోళన చేపట్టినట్లు కార్మికులు తెలిపారు. వేతన చెల్లింపుల్లో వ్యత్యాసం చూపుతూ తమను ఆర్థికంగా నష్టపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పారిశుధ్య విభాగంలో 65 మంది కార్మికులు పనిచేయాల్సి ఉండగా కేవలం 42 మందితోనే పనులు చేయిస్తున్నారని వారు ఆరోపించారు. తగిన సిబ్బంది లేకపోవడంతో పనిభారం పెరిగిందని, జీతాలు మరియు ఇతర సదుపాయాల్లో అన్యాయం జరుగుతోందని తెలిపారు. అదేవిధంగా మేజర్ పంచాయతీ నిధుల వినియోగంలో అవకతవకలు జరుగుతున్నాయని కార్మికులు ఆరోపించారు. పారిశుధ్య సిబ్బందికి ఇచ్చే వస్త్రాలు, ఇతర సామగ్రి కొనుగోలులో సుమారు రూ.7 లక్షల మేర గోల్మాల్ జరిగినట్లు పేర్కొన్నారు. బ్లీచింగ్ కొనుగోలులో కూడా నిధుల దుర్వినియోగం జరిగిందని, పనిచేయని ట్రాక్టర్‌కు లక్షల్లో అద్దె చెల్లించిన సంఘటన కూడా జరిగిందని వెల్లడించారు. ప్రత్యేక అధికారి తక్షణమే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

### - శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**జలుమూరు, ఏప్రిల్ 15 (వార్త):** ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టెక్కలి డివిజన్ శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్ సూచించారు. బుధవారం జలుమూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తత ఎంతో అవసరమని తెలిపారు. తెలియని లింకులు, కాల్స్, సందేశాలకు స్పందించకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అదేవిధంగా మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని, అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని, దీనివల్ల ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉందని వివరించారు. బాలలు, మహిళలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, శక్తి యాప్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో సహాయం పొందవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వివిధ అంశాలపై అవగాహన పొందారు.



### చైన్‌స్నాచింగ్ కేసులో ..

## నిందితుడికి జైలుశిక్ష, జరిమానా

### -మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్



**మందస, ఏప్రిల్ 15(వార్త):** చైన్ స్నాచింగ్ కేసులో నిందితునికి జైలుశిక్ష, జరిమానా సోంపేట కోర్టు విధించిందని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ చెప్పారు. ఆయన చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. మందస పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబరు 26/2024 చైన్ స్నాచింగ్ 2024వ సంవత్సరం 10 నెల తొమ్మిదిన మధ్యాహ్నం 3:30 సమయంలో మఖరజోల హైవే పక్కన గ్రామాల్లో చిన్న దుకాణంలో ఉన్న వృద్ధురాలి మెడలో చైన్ స్నాచింగ్ చేశారు. బాధితురాలి కుమారుడు వడ్డి బాబురావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. కేసులో బుధవారం సోంపేట ఏజేఎంఎఫ్సి కోర్టు జడ్జి కంచి శ్రీనివాసరావు నిందితునికి ఆరు నెలలు కఠిన కారగార శిక్ష అదేవిధంగా 1000 రూపాయలు జరిమానా విధించారు. వెయ్యి రూపాయలు చెల్లించని పక్షంలో మూడు నెలలు సాధారణ శిక్ష వేశారు. ఆరునెలలు కఠిన కారగార శిక్ష, 1000 రూపాయలు జరిమానా చెల్లించకపోతే మూడు నెలల సాధారణ జైలు శిక్షతో మొత్తం తొమ్మిది నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. ఈ కేసును ఏపీపీ ఎస్.నరేష్ వాదించారని ఎస్ఐ కృష్ణప్రసాద్ చెప్పారు.

## తామరపల్లి పంచాయతీ స్పెషలాఫీసర్‌గా పొదిలాపు శ్రీనివాస బాధ్యతల స్వీకరణ

### - గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ



**నరసన్నపేట, ఏప్రిల్ 15 (వార్త):** తామరపల్లి పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా డిప్యూటీ తహశీల్దార్ పొదిలాపు శ్రీనివాస్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. గ్రామసభలో మాట్లాడిన ఆయన, పంచాయతీలో ఉన్న సమస్యలను గ్రామస్తులు తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామస్తులు సమస్యలను నిర్మొహమాటంగా తెలియజేయాలని, సమన్వయంతో పనిచేస్తే పంచాయతీ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చోడవరంలో రెండో విడత భూముల రీ-సర్వే

**నరసన్నపేట, ఏప్రిల్ 15 (వార్త):** చోడవరం రెవెన్యూ గ్రామంలో రెండో విడత భూముల సమగ్ర రీ-సర్వే ప్రక్రియను బుధవారం ప్రారంభించినట్లు తహసిల్దార్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. భూముల రీ-సర్వేకు సంబంధించి రైతులు ఎదుర్కొనే ఎటువంటి ఇబ్బందులైనా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. సర్వే ప్రక్రియలో పొరపాట్లు ఉంటే సరిదిద్దుకునేందుకు ఇది మంచి అవకాశం అని పేర్కొన్నారు. ఈ రీ-సర్వే ద్వారా భూములపై ఖచ్చితమైన హక్కులు నిర్ధారించ బడతాయని, భవిష్యత్తులో వివాదాలను నివారించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులు పూర్తి సహకారం అందించి సర్వే విజయవంతం చేయాలని అధికారులు కోరారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546